క్లుప్తంగా

ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి గ్రామంలో సేవాలాల్ మహరాజ్ ఆలయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. పండితులు పిసుపాటి రేవంత్‌శర్మ బృందం ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, మండప దేవతాహోమాలు, జగదాంబ–సేవా లాల్ మహరాజ్ యంత్ర, శిఖవిగ్రహం, ధ్వజ ప్రతిష్ఠాపనతోపాటు పూర్ణాహుతి, అన్నదానం తదితర పూజలు చేశారు. చివరిరోజు లాల్ టేక్డికి చెందిన ప్రకాశ్ మహరాజ్ హాజరై భక్తులకు ప్రవచనాలు చేశారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి బోనాలు


బోనాలతో వెళ్తున్న మహిళలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గీతా రేణుక మాత ఎల్లమ్మ ఆలయ వార్షిక ఉత్సవాలను గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏఎన్ రెడ్డి కాలనీలోని మహిళలు పోచమ్మ ఆలయంలో అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పారిశ్రామిక సంఘం సభ్యులు ఉన్నారు.

సీపీఎస్ రద్దుకు కృషి


మాట్లాడుతున్న అభ్యర్థి సాయన్న

ముధోల్: తనను గెలిపిస్తే సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ కోసం కృషి చేస్తానని బీఎస్పీ బలపర్చిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి యాటకారి సాయన్న పేర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు బీఎస్పీ నాయకులు, తదితరులు ఉన్నారు.

భీమన్న దేవుడి పండుగ


పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో ఆదివారం భీమన్న దేవుడి పండుగ, జాతర నిర్వహించారు. భీమన్నగుట్ట ఆలయంలో భీమన్న దేవుడికి బండారు, బాసంతం, కల్యాణం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి రూ.రెండు వేలను విరాళంగా అందించారు. మండలాధ్యక్షుడు మల్లేశ్, భూషణ్, కోల శ్రీనివాస్, జగన్‌రెడ్డి, యాదగిరి, సత్యం, భీమేశ్, రాజన్న తదితరులున్నారు.

సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు


విగ్రహం వద్ద గ్రామస్తులు, ఉపాధ్యాయులు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆదివారం సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దాతలు హెచ్‌ఎం సిలారి ఊర్మిళ, ఉపాధ్యాయుడు దురిశెట్టి శ్రీనివాస్, గ్రామస్తులు గాజుల గంగాధర్, గోపు శేఖర్ విగ్రహం సమకూర్చగా అర్చకులు కోటపల్లి అనీశ్, నితీశ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జంగిలి శంకర్, వెంకటరాజు, హరీశ్, రాజేందర్ నాయక్, గంగన్న, నరేందర్, కృష్ణ, ఆశన్న, మహ్మద్, చాంద్‌బీ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

భైంసాటౌన్: పట్టణానికి చెందిన బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఉత్తర తెలంగాణ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి ప్రసంజిత్ హేమ్లేను ఆదిలాబాద్‌లో ఘనంగా సన్మానించారు. చిలుకూరి లక్ష్మీనగర్‌లో ఆదివారం గురు రావిదాస్ జయంతి సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న, ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు, సాహిత్యవేత్త మధు భావల్కర్ ఆధ్వర్యంలో ఆయనకు అంబేడ్కర్ సమాజ్ రత్న అవార్డు అందించి శాలువాతో సత్కరించారు.

తాగునీరు పంపిణీ

కుంటాల: ఆదర్శ పాఠశాలలో ఆదివారం గురుకుల ప్రవేశ పరీక్ష నిర్వహించగా విద్యార్థులతో వచ్చిన పోషకులు సౌకర్యాల్లేక ఇబ్బంది పడ్డారు. ఈవిషయం తెలిసి స్థానిక ఏఎస్సై జీవన్‌రావు ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ ఆవరణలో కార్పెట్ వేయించి తాగునీటిని అందించారు. దీంతో పోషకులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సొంత భవనాలేవి?


కామోల్ అంగన్‌వాడీ కేంద్రంలో రెండు సెంటర్ల పరిధిలోని చిన్నారుల వద్ద సహాయకురాలు

- కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు బడుల్లో.. మరికొన్ని అద్దె ఇళ్లలో నిర్వహణ
- ఏళ్లు గడుస్తున్నా.. పెరగని అద్దెలు
- జీతంలోంచి చెల్లిస్తున్నామంటున్న టీచర్లు
- ఇబ్బందుల్లో లబ్ధిదారులు, సిబ్బంది


దేగాంలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

భైంసారూరల్: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, ఐదేళ్లలోపు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు ప్రభుత్వం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇక్కడ చిన్నారులకు ఆటపాటలతో విద్య, మహిళలకు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు. కానీ భైంసా మండలంలో ఉన్న మెజార్టీ అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కరువయ్యాయి. ఏళ్లుగా అద్దె ఇళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లోనే ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు, అంగన్‌వాడీ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి..

భైంసా మండలంలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు 53 ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు 31 కాగా.. సొంతభవనాల్లో మరో 16 ఉన్నాయి.

సొంత భవనాలు కేంద్రాలు..

మాటేగాం, హంపోలి, ఎగ్గాం, మహాగాం–1, కుంబి, కోతల్‌గాం, సిద్దూర్, దేగాం–2, ఇలేగాం, బడ్‌గాం, వాలేగాం–1, కుంసర, వానల్‌పాడ్–1, పేండ్‌పెల్లి–1, తిమ్మాపూర్–1, చుచుంద్–1 గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలున్నాయి. వాటోలి, మహాగాం, టాక్లి, సిరాల, బాబుల్‌గాం, దేగాం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మహాగాం, కామోల్ క్లస్టర్ల వారిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో అధికశాతం ఉచిత, అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అద్దె భవనాల్లో నిర్వహించే కేంద్రాలకు ప్రభుత్వం ప్రతినెలా రూ.వెయ్యి మాత్రమే చెల్లిస్తోంది. క్షేత్రస్థాయిలో కేంద్రం అద్దె రూ.రెండు వేలకు పైనే ఉంది. అద్దెలు అధికంగా ఉన్న చోట నిర్వాహకులే సొంతంగా చెల్లిస్తున్నారు.

తప్పని ఇబ్బందులు..

అద్దె భవనాల్లో నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు కూడా లేవు. శిథిలావస్థకు చేరిన గోడలు, తలుపులు, కిటికీలు ఊడిపోయి ప్రమాదకరంగా మారాయి. వాలేగాం, కామోల్, తిమ్మాపూర్ గ్రామాల్లో ఒకే చోట రెండు, మూడు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం దృష్టి సారించి మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించి సౌకర్యాలు కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆయా కేంద్రాల్లో ఖాళీలు ఇలా..

మండలంలో దేగాం, మాంజ్రి, కామోల్–2, చుచుంద్–1, ఇలేగాం–1, చింతల్‌బోరి–2, మిర్జాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడు టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మాంజ్రి, హజ్గుల్, ఎగ్గాం, వాటోలి, హంపోలి, చింతల్‌బోరి, దేగాం, కోతల్‌గాం, వాడి, కుంసర, సుంక్లి, ఇలేగాం, వానల్‌పాడ్, కామోల్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 14 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ఉన్నతాధికారులు దృష్టిసారించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.500 చెల్లిస్తున్నాం



దేగాంలో అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేదు. అద్దె భవనంలో నెలకు రూ.1500 చెల్లిస్తున్నాం. ప్రభుత్వం మాత్రం ప్రతినెల రూ.వెయ్యి మాత్రమే ఇస్తోంది. మరో రూ.500 ప్రతి నెల నా జీతంలోంచి నేనే చెల్లిస్తున్నా. రూ.వెయ్యిలోపు గదులు దొరకడం లేదు. మాకు ఇబ్బంది అవుతోంది.

– దేవలత, అంగన్‌వాడీ టీచర్, దేగాం

ఉన్నతాధికారులకు నివేదించాం

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల విషయం, సొంత భవనాలు నిర్మించే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలకు ప్రతి నెలా రూ.వెయ్యి చెల్లిస్తున్నాం. సిబ్బందికి ఇబ్బందుల్లేకుండా చూస్తాం.

– రాజశ్రీ, సీడీపీఓ

హాల్‌టికెట్ ఉన్నా.. నో ఎంట్రీ


కడెం : ఆవేదన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

- దరఖాస్తుల తిరస్కరణతో గురుకుల ప్రవేశపరీక్ష రాయని విద్యార్థులు
- బాధతో ఇంటిబాట పట్టిన వైనం

కడెం: ఐదో తరగతిలో గురుకులంలో ప్రవేశం పొందేందుకు ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు..హాల్‌టికెట్ వచ్చింది తీరా పరీక్ష కేంద్రానికి వెళ్లగా..మీ అప్లికేషన్ రిజెక్ట్ అయింది మీ కూతురు పరీక్ష రాసేందుకు అనుమతి లేదని అధికారులు చెప్పడంతో కంగుతిన్నారు కడెం మండలం దిల్దార్ నగర్‌కు చెందిన విద్యార్థిని తల్లిదండ్రులు. కడెం మండలం నచ్చన్‌ఎల్లాపూర్ గురుకులంలో ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష రాసేందుకు వచ్చిన 743 మంది విద్యార్థుల్లో 17 మంది దరఖాస్తులు రిజెక్ట్ కావడంతో పరీక్షకు అనుమతించలేదు.

గందరగోళంగా ఆన్‌లైన్ దరఖాస్తులు..

ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో 5,6,7,8 తరగతుల్లో ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించారు. ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వెంటనే హాల్ టికెట్లు జారీ చేశారు. తీరా దరఖాస్తులను పరిశీలించి, తప్పులు, కులం, ఆదాయం తదితర ధ్రువపత్రాలు మిస్ మ్యాచ్, సమర్పించని కారణాలతో కొన్నింటిని రిజెక్ట్ చేశారు. హాల్‌టికెట్ జారీకి ముందే దరఖాస్తులు పరిశీలించి.. హాల్ టికెట్లు జారీ చేస్తే ఇలాంటి ఇబ్బందులు తలెత్తేవికావు. తీరా పరీక్షా కేంద్రానికి వెళ్లాక పరీక్షకు అనుమతించకపోవడంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

ముధోల్‌లో నలుగురు విద్యార్థులు..


ముధోల్‌లో పరీక్ష రాయకుండా వెనుదిరిగిన విద్యార్థులు

ముధోల్: దరఖాస్తులు తిరస్కరణకు గురవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలకేంద్రంలోని బాలుర గురుకులంలో నలుగురు విద్యార్థులను పరీక్షకు అనుమతించలేదని ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి తెలిపారు.

మాకు సమాచారం ఇవ్వలేదు..

ఆన్‌లైన్ అప్లికేషన్ విధానం సరిగా లేకపోవడంతో కొందరు విద్యార్థులకు అన్యాయం జరిగింది. దరఖాస్తు రిజెక్ట్ గురించి మాకు సమాచారం ఇవ్వలేదు. తీరా పరీక్ష కేంద్రానికి వెళ్లాక పరీక్షకు అనుమతించకపోవడంతో బాధ కల్గింది. ఉన్నతాధికారులు స్పందించి మాలాంటి వారికి న్యాయం చేయాలి.

– రాజశేఖర్, విద్యార్థిని తండ్రి, దిల్దార్‌నగర్

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

నచ్చన్‌ఎల్లాపూర్ గురుకులంలో 743 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా అందులో 17 మంది విద్యార్థుల అప్లికేషన్లు రిజెక్ట్ అయ్యాయని మాకు లిస్ట్ వచ్చింది. అప్లికేషన్ రిజెక్ట్ అయిన వారి సెల్‌ఫోన్లకు మెసేజ్ వెళ్లినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

– శకుంతల, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, నచ్చన్‌ఎల్లాపూర్

ముగిసిన మహోత్సవం

లోకేశ్వరం: మండలంలోని ధర్మోరలో భక్తాంజనేయస్వామి ఆలయంలో చేపట్టిన నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం ముగిసింది. యంత్ర స్థాపన, విగ్రహస్థాపన, శిఖర, ధ్వజస్తంభ స్థాపన, పూర్ణాహుతి, సీతారాముల కల్యాణం, తీర్థప్రసాద సేవ, ఉత్సవమూర్తుల ఊరేగింపు సేవా కార్యక్రమాలను బ్రహ్మశ్రీ కుప్పకంటి సురేశ్‌శర్మ జరిపించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఉన్నారు.


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కాంగ్రెస్ నాయకుల ప్రచారం


లక్ష్మణచాందలో ప్రచారం చేస్తున్న నాయకులు


బాసరలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


కుంటాలలో ప్రచారం చేస్తున్న నాయకులు


కడెం : ప్రచారం చేస్తున్న దుర్గాభవాని, నేతలు

లక్ష్మణచాంద: పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ బలపర్చిన నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆదివారం ఆ పార్టీ నాయకులు లక్ష్మణచాందలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నిర్మల్ ఏఎంసీ వైస్‌చైర్మన్ ఈటెల శ్రీనివాస్, ఓస రాజేశ్వర్, రజనీకాంత్, రవి, నగేశ్, వినేశ్, సిరాజ్, పాల్గొన్నారు.

బాసర: నరేందర్‌రెడ్డిని గెలిపించాలని బాసరలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. మండలంలో ఉన్న 204మంది పట్టభద్రుల ఓటర్లను కలిసి చేతి గుర్తుకు ఓటేయాలని కోరారు. ఎన్‌ఎస్‌యూఐ నాయకులు జంగం శశిధర్, జంగం రమేశ్ తదితరులు ఉన్నారు.

కుంటాల: నరేందర్‌రెడ్డికి మద్దతుగా కుంటాలలో జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. మాజీ జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న, సింగిల్‌విండో మాజీ చైర్మన్ జుట్టు లక్ష్మణ్, డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్, ఏఎంసీ డైరెక్టర్ తాటి మహిపాల్, దేవిదాస్, ఖదీర్, గజేందర్, శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

ఖానాపూర్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని వ్యవసాయ, పరిశ్రమల అభివృద్ధి రాష్ట్ర చైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. ఆదివారం ఖానాపూర్‌తోపాటు మండలంలోని మస్కాపూర్ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దయానంద్, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేశ్, సత్యనారాయణ, సాగర్, నర్సయ్య, లక్ష్మణ్, షౌకత్‌పాషా, కొడిమ్యాల వీరేశ్, సచిన్ తదితరులు ఉన్నారు.

కడెం: నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చొప్పదండి దుర్గభవాని అన్నారు. మండలంలోని లింగాపూర్‌లో ప్రచారం నిర్వహించారు. మహిళా విభాగం మండలాధ్యక్షురాలు మాదాసు సురేఖ, లచ్చన్న, దేవారెడ్డి, భూమన్న, గంగన్న, రాజేశ్వర్ ఉన్నారు.

లోకేశ్వరం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ ముధోల్ ఇన్‌చార్జి నారాయణ్‌రావు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని ధర్మోర గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సుదర్శన్‌రెడ్డి, శంకర్‌చంద్రే, మహ్మద్ షఫీ, హర్షప్రసాద్, సృజన్, మామిడి నారాయణ్‌రెడ్డి, ముత్యంరెడ్డి ఉన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశపరీక్ష


కుంటాలలో తనిఖీ చేస్తున్న అధికారులు


కడెం : పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు


రాచాపూర్ ఎంజేపీలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కుంటాల: ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో ఐదో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. కుంటాల ఆదర్శ పాఠశాలలో 521 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఎనిమిది మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, డీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఏఎస్సై జీవన్ రావు ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించారు.

భైంసాటౌన్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగా విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకున్నారు. 596 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 594 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ సుమలత తెలిపారు.

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గురుకులంలో నిర్వహించిన ప్రవేశపరీక్షకు 743 మంది హాజరవగా 25మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ శకుంతల పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాన్ని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి సందర్శించారు.

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ జ్యోతిబాపూలే బాలుర గురుకులంలో ప్రవేశపరీక్ష సజావుగా ముగిసింది. 238 మంది విద్యార్థులకు గాను వందశాతం హాజరైనట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకులంలో 234 మంది విద్యార్థులకు గాను 232 మంది ప్రిన్సిపాల్ సంతోష్ తెలిపారు. బాలికల గురుకులంలో 238 మందికి గాను 235 మంది హాజరైనట్లు సృజనాదేవి తెలిపారు.

సారంగాపూర్: మండలంలోని జామ్ సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకులంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 756మంది విద్యార్థులకు గాను 740మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు.

సోన్: మండలంలోని లెఫ్ట్‌పోచంపాడు పరీక్షా కేంద్రంలో 504 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 486 మంది పరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ ఆర్.ప్రశాంతి అన్నారు.

ముధోల్: మండలకేంద్రంలోని బాలుర గురుకులంలో 590 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 574 మంది హాజరయ్యారు. మహాత్మ జ్యోతిబాపూలే గురుకులంలో 236 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 232 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ అమృత తెలిపారు. డిపార్ట్‌మెంట్ అధికారులు శ్రీనివాస్, శిరీష ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. ఇళ్ల మధ్యనే ట్రాన్స్‌ఫార్మర్



తానూరు: మండలంలోని బోంద్రట్ గ్రామంలో ఎస్సీ కాలనీలో ఇళ్ల పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేక ప్రమాదకరంగా మారింది. కొద్దిపాటి గాలి వీచిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు వస్తున్నాయి. దీంతో స్థానికులు ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందని భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : ప్రదీప్, విద్యుత్ ఏఈ, ఫోన్: 94408 14880

కళాశాల వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కుంటాల: మండలంలోని కల్లూరులో వాసవి జూనియర్ కళాశాల 21వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ప్రిన్సిపాల్ బోయ సాయిలు పేర్కొన్నారు. విద్యార్థుల నాటికలు, నృత్యాలు అలరించాయి. ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్‌గౌడ్, గట్టుపల్లి శ్రీనివాస్, సంతోష్, డైరెక్టర్లు కదార్ల హరిప్రసాద్, జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ గ్రామంలో హనుమాన్ ఆలయ ప్రారంభోత్సవం, నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వీడీసీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ హనుమాన్, నంది విగ్రహాలను ప్రతిష్ఠించి ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం గర్తన్యాసం, యంత్ర ప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి, అన్నప్రసాద వితరణ తదితర పూజాది కార్యక్రమాలు చేపట్టారు. బీజేపీ నాయకులు అయిండ్ల భూపాల్‌రెడ్డి, అడ్వాల రమేశ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కేశం శ్రీనివాస్, తాజా మాజీ సర్పంచ్ రవి, వీడీసీ సభ్యులు రమేశ్, ఆశన్న, కేశం లక్ష్మణ్, అశోక్ భక్తులు పాల్గొన్నారు. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, ధర్మాజీగారి రాజేందర్, శ్రీకాంత్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఐకేరెడ్డిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.


ఆలయం వద్ద గ్రామస్తులు

'ముస్తాక్ అలీని గెలిపించాలి'


మాట్లాడుతున్న హైదర్, పక్కన ముస్తాక్ అలీ

నిర్మల్‌టౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీగా స్వతంత్ర అభ్యర్థి మహమ్మద్ ముస్తాక్ అలీని గెలిపించాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆమ్ ఆద్మీ పార్టీ ముస్తాక్ అలీకి మద్దతిస్తున్నట్లు పేర్కొన్నారు. ముస్తాక్ అలీ మాట్లాడుతూ ప్రజల మధ్యలో ఉంటూ సేవా కార్యక్రమాలు చేస్తున్న తనకు పట్టభద్రులు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. ఇందులో పలువురు నాయకులు ఉన్నారు.